పక్కకు తిరిగి బెడ్ మీద రెస్ట్ తీసుకోవాలిసి వచ్చింది. పేరును సార్థకం చేసుకొంటూ అతనూ, అతని నవల చీకటి కూడా చీకటిలో ఉండి పోయింది.

ఈ మధ్య కొన్ని పుస్తకాల్లో పెద్దవాళ్ళు వ్రాసిన ముందు మాటలు ఆ పుస్తకమంతా పూర్తయిన తర్వాత చివరికి ఉంటున్నాయి. కారణమేమిటని ఆరాతీస్తే ఆలస్యంగా వచ్చాయని, అందుకని వెనుక వేసామని చెప్పారు. మరి అది ముందుమాట ఎలా అవుతుందని అమాయికంగా నేను ప్రశ్నిస్తే – "ముందు వ్రాయమని చెప్పిన మాట కదా! అందుకని అది ముందు మాటే అవుతుంద"ని జవాబు. హత్తోస్మి.

ముందు మాటలు తక్కువైన వేమీ కావు. వివిధ పుస్తకాలకు తాము వ్రాసిన ముందు మాటలను కలిపి పుస్తకాలు అచ్చు వేసిన వాళ్ళు ఉన్నారు. వాళ్ళు వ్రాసిన ఆ ముందు మాటల పీఠికల మీద పిహెచ్‌డీలు చేసి డాక్టరేట్‌లును సంపాదించుకొన్నవారున్నారు.

ముందు మాటలకి ఇన్ని పేజీలు ఉండాలని నియమం లేదు. కనుక ఎవరి ఓపిక మేరకు వారు దున్నేస్తుంటారు. కొంతమంది ఈ ముందు మాటలలో ఎక్కడా లేని కనీ వినీ ఎరుగని కొటేషన్లు నింపి, తాము పండితులమని లోకం గుర్తించాలని కోరుకొంటుంటారు.

"చైనా తత్త్వవేత్త 'టింగ్ చింగ్' ఒకసారి ఏమన్నారంటే నీ కోరికలు నీకు వశమైనప్పుడు, నువ్వు నీకు శత్రువుగా మారతావు. నీకు ప్రశాంతి ఏర్పడుతుంది" అని ఒక ముందుమాటలో ఉంది. పుస్తకాలు చదివే చాలామంది మనలాంటి విజ్ఞానం నేర్చుకోవాలనే తపన ఉన్నవారే ఉంటారు. టింగ్ చింగ్ ఉన్నాడేమో! అతడలా అన్నాడేమో అనుకొంటాం తప్ప, ఆ వ్రాసినాయన్ని నిలదీయం. ఎందుకంటే ఆ వ్రాసినాయన బాగా చదువుకొన్నాడని మనకు ప్రగాఢమైన నమ్మకం.

అలాగే ఒక వాక్యాన్ని, పదాన్ని ముందు మాటలలో ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తారు. "ఉల్లిపాయ అంటే ఏమిటి? అందులో పాయ అనే శబ్దం బట్టి తెలుస్తోంది కదా... అది నదీపాయలోనిదని. అంటే పూర్వ కాలంలో ఉల్లి అనే నది ఉండేదని, దాని పాయలు బాగా విస్తరించి ఉండేవని మనం నమ్మవచ్చు. ఉల్లిని కోయడం ద్వారా మన కళ్ళ వెంబడి వచ్చే కన్నీళ్ళు కూడా – ఉల్లిపాయలోని ఉల్లి – నది అనటానికి – దాని నదీ గుణానికి ప్రత్యక్ష సాక్ష్యం." ఇలా ఇష్టం వచ్చినట్లు ముందు మాటలలో చెబుతుంటే– చదువుతున్న మనం– మన జన్మ తరించి పోయిందని, మన హృదయాలు వికసించాయని, మన తెలివి తేటలు పెరిగాయని పొంగిపోతాం.

ఇలా– ముందు మాటల వెనుక మాటలు ఎన్నయినా చెప్పుకోవచ్చు. నేను ముందే మనవి చేసినట్లు – మంచిగా ముందు మాటలు వ్రాసేవారు లేరని కాదు. ఉన్నారు. వారి ముందు మాటలకు వెనుక మాట 'సెబాస్' తప్పించి మరొకటి లేదు.

లోపలంత డొల్లయినా– తప్పెట – దడదడా మోగుతుంది. కొన్ని ముందు మాటలు అంతే. అలా మోగి పోతుంటాయి. పాఠకుల మెదళ్ళను బలి ఇవ్వటానికి– పుస్తకాల దేవతల ముందు అలా ముందు మాటల తప్పెటలు విపరీతమైన శబ్దాల చప్పుడు చేస్తుంటాయి. వెనుక మాటలు ఎన్నన్నా లాభం లేదు. భరించాల్సిందే. తప్పదు. శుభమ్ భూయాత్. ■

# బసవా! బసవా!

–డా॥ భండారు ఉమామహేశ్వరరావు

**జం**గయ్య కంటె ముందే లేచినయి పిట్టలు. అయ్యవారు గుడి తలుపులు తీయటానికి ఇంకా రాలేదు. అందరికంటే ముందు తామే సోమనాథుణ్ణి పలకరించాలని కాబోలు పిట్టల తపన. సింహద్వారం ముందర కూర్చుని ఉన్నాడు జంగయ్య.

ఆ గుడికి అప్పుడప్పుడూ పెద్ద పెద్ద వాళ్ళు కూడా వస్తుంటారు. ఏమేమో మాట్లాడుతుంటారు. ఎవరో పాల్కురికి సోమన అట. దేవుడి మీద చాలా పాటలు రాశాడట. ఈయన తప్ప పెపంచకంలో మరొక దేవుడే లేడన్నాడట.

పాలకుర్తిని పాల్కురికి అని ఎందుకు అంటారో అతనికి తెలియదు. అయ్యవారిని అడుగుదామంటే అభిమానం. ఇక్కడ పుట్టి ఇక్కడ పెరిగిన వాడివి ఆ మాత్రం తెలీదా జంగా అంటాడని. మనుషుల నోళ్ళల్లో నాని నాని పాల్కురికి పాలకుర్తి అయిందని అతను చివరకు నిశ్చయించుకున్నాడు. అయ్యవారు తన కొడుకుకు కుమారస్వామి అని పేరు పెడితే తను 'కొవాఁరి' అని పిలుచుకుంటున్నట్లు.

అన్ని కష్టాల్లోనూ జంగయ్యకు సోమన్నే తోడు.

పెద్ద దొర జీతం ఇయ్యకపోయినా, దొరసాని సద్దన్నం పెట్టకపోయినా, సంతలో సామాన్లు తను కొనలేకున్నా, తన కొడుకు కొవాఁరికి విరేచనాలయి కాళ్ళు చేతులు వేళ్ళాడపడి డాక్టరు పైసలియ్యందే మందియ్య నన్నా సోమన్న విభూతి నోట్లో వేసి అయ్యగారు ఇచ్చిన మారేడు తీర్థం తాపితే తగ్గినయి.

ఇప్పుడు కూడా ఆ సోమన్నే ఆదుకుంటాడన్న ధైర్యంతో జంగయ్య క్రితం రాత్రే కొండదారి గుండా ఎక్కి గుడిముందర ద్వారానికి ఆనుకుని కూర్చున్నాడు.

రాత్రి పొద్దుపోయింది. జంగయ్య లేచి నిరాశగా కిందకు దిగాడు. అతని ఎద్దు తప్పిపోయింది. మూడు రోజులయింది. తన చేత్తో ఉలవలు పెడితే తప్ప తినదు. తను పక్కన ఉంటే తప్ప కుడితి తాగదు. పొలంలో అది బద్ధకించినపుడు అందరిలాగా "ఓసి నీ ఎద్దు పగల గొయ్య!" అని కూడా ఎప్పుడూ అనడు. కొయ్యటం సంగతి అట్లా ఉంచి దాన్ని కొట్టటమనే ఆలోచనే జంగయ్యకు భయంకరం. అంతకంటె తన చెయ్యి నరుక్కోవటం అతనికి అసలు నెప్పిలేని పని.

గుడిసెలోకి వెళ్ళాడు. తను మూడు రోజులయింది సరిగా అన్నం తినక. గౌరమ్మ కూడా అంతే. "తినవే! ఏం కాదు. ఆ సోమన్నే తీసుకొస్తడు మన బసవన్నను. ఆయనెక్కి తిరిగే నంది దేవుడే కాదె.. మనకంటె ఆయనకే ఎక్కువ కష్టమయితది బసవడు లేకుంటే. అందుకే రేపు పొద్దుగాల్నె పోతాన కొండమీదకు మల్ల."

"ఏం చేస్తవు పోయి!" అని అడిగింది గౌరమ్మ.

"ఎమ్మో! రాత్రంత ఎతికెతికి తెచ్చి కట్టేసిందు గావచ్చు. ఎమ్మో! ఎవనికెర్క! సోమన్న, ఆ పార్వతమ్మ కలిసి మన నందీశ్వరుని మీద ఎక్కి కైలాసం దిక్కు పోయిండ్రు కావచ్చు. కైలాసం ఈడుంటాదె?"

"ఏడుంటది!"

"ఓసి! పిచ్చిదానా! ఆ కొండలల్లాటాలె. మబ్బుల్లాటాలె. ఆకాశంల గడ్డాల అయ్యగార్లుంటరు సూడు. సినిమాలల్ల సూస్తాంటం."

"ముక్కు మూస్కొని కూకుంటరు గవాల్లీనా!"

"ఆఁ! గవాల్లె! వాళ్ళందరూ ఈన కోసం సూస్తాంటరట. కైలాసం అంటె తెల్వదానె. మంచు కొండలుంటయ్. నాగుపాములుంటయ్."

"అంత శితాలం. ఎట్లుంటదయ్య సోమన్న! పెయి మీద పురగ బట్టలే ఉండవు గదా!"

"ఆయనకేందే! ఆయన మూడో కంట్ల నుంచి నిప్పులు కురుస్తాంటయ్. ఎంత శీతాలమయితే ఏమయితది."

"అది సరేగని మన బసవని సంగతేంది. ఏడ తిరుగుతాండో!"

"నువ్వు రంది పెట్టుకోకు. మన బసవడు యాడికి పోతడే. ఇయ్యాల ఎట్లైవొస్తడు. రాకుంటె పచ్చిగంగ ముట్ట."

"ఇప్పుడు తింటానవా!"

"నువ్వు గూడ తింటలేవు గదా!" అంటూ నులక మంచం మీద వాలాడు జంగయ్య. రాత్రి అంతా కలలు. కలత నిద్ర.. పూర్తిగా తెల్లవారక ముందే లేచి గబగబా కాలకృత్యాలు తీర్చుకుని కొండ ఎక్కటానికి బయల్దేరాడు జంగయ్య. వెళ్తూ వెళ్తూ "బసవడు ఇంటిగ్గానొస్తే కొవాఁరి గాన్తోని చెప్పంపవే. గుడి తీసినంక దండం పెట్టుకొని ఎతికెటందుకు పోత బసవణ్ణి" అని సమాధానం కోసం ఆగకుండా వేగంగా కొండవైపు వెళ్ళిపోయాడు.

○ ○ ○

"ఉన్నదొకటే మారేడు చెట్టు. అదీ కొండ కింద. ఇంత అడవిలో పొయ్యిలో కట్టెలకు దేవుడి చెట్టే కావాల్సొచ్చిందా. ఇంతకంటే పాప ఖర్మం ఉంటుందా. ఎంత నిష్ఠగా పూజలు చేసిన గుడి ఇది" "బసవా! బసవా!" అంటూ ఆ వృషాధిపుణ్ణి ఆ సోమన్న గుండెలవిసేట్టు పిలిచాను గద జంగా! ఆ మారేడు చెట్టు కింద బసవ పురాణం చెప్పుకోకుండా ఎప్పుడయినా శివరాత్రి జాగరణ చేస్తామా మనం. ఇహ ఈ ఊరు

## హత్యా ఆత్మహత్యా!

**అ**ది హత్యా
ఆత్మహత్యా
మందారం
క్రింద పడుంది
రెక్కలు నలిపేసిన ఆనవాళ్ళు
మకరందం పుబికింది
కుళ్ళు సమాజపు
వేలి ముద్రలు
అప్రయత్నంగా
నా కళ్ళంట నీళ్ళు!

–హరితశ్రీ

కాలగర్భంలో కలసి పోతుంది. నాకు తెలుసు. మారేడు దళాలు తెచ్చేదాకా నేను పచ్చి గంగ ముట్టను. ఈసారి గుడి ముందరే చెట్టు నాటాలి. అప్పటిదాకా నాకు నిద్రాహారాలు అవసరం లేదు. అంతే!" అంటూ అయ్యవారు వెయ్యి శంఖాలూదిన శబ్దంతో ఆ రాళ్ళు, చెట్లు, చెట్ల మీది కోతులు కూడా చెదిరిపోయేట్టు ఆక్రోశించాడు.

అయ్యవారు తలచుకుని బాధపడుతున్న మారేడు చెట్టు కొట్టేసిన నాడే జంగయ్య బసవడూ కనపడకుండా పోయాడు.

దొంగ తిండి కాని మరగ లేదు కదా! ఛ! ఛ! తన బసవడికా బుద్ధి లేదు. అయ్యవారు తనకు చెప్పే మంచి మాటలనీ బసవడు కూడా వింటుంటాడు అప్పుడప్పుడూ.

అయ్యవారూ పస్తే- తనూ పస్తే- గౌరమ్మా పస్తే. తిట్టంగ తిట్టంగా కొడుకు కొవాంరి రెండు ముద్దులు తిన్నాడు.

ఎండ నడినెత్తి కొచ్చింది. నీడలు ముడుచుకుం టున్నాయి. మట్టి గోడకు ఆనుకుని కూర్చున్నాడు జంగయ్య. "ఈ బసవడు దొంగ తిండి మరగలేదు కదా!" మళ్ళీ అదే అప్రియమయిన ఆలోచన. "ఎవరైన తీసుకెళ్ళి కొట్టటల్లేదు కదా!" అని బాధపడ్డాడు. మూడేళ్ళ క్రితం బమ్మెర సంతలో కొన్నప్పటి నుంచీ బసవణ్ణి ఒక్క దెబ్బ కొట్టి ఎరగడు. ఎవరయినా కొడతారన్న ఆలోచనే భయం కరంగా ఉంటుంది జంగయ్యకు.

బసవణ్ణి చూసుకుని ఎంత గర్వపడేవాడు. "ఒరేయ్! ఆ జంగణ్ణి సూడు. బసవని కొమ్ములు వానికే మొలచినట్లు ఎట్ల రొమ్మిరుచుకుని నడుస్తాండో..." అన్న కుర్రకారు మాటలు విని కోపం తెచ్చుకునే వాడు కాదు. బసవని కొమ్ములు నిమురుతూ నవ్వుకునేవాడు. బసవడి మెళ్ళో గంటల చప్పుడు వింటుంటే జంగయ్యకు జల్లుమంటూ ఒక అనుభూతి కలుగుతుంది.

ఆ మువ్వలు చూసి "దీన్ని గంగిరెద్దు చేస్తావుర" అని పటీల్ వెటకారంగా అడిగినప్పుడు, "కాద్దొర! జంగడెద్దును చేస్తాను" అనేవాడు తల వంచుకుని. బసవడు మాత్రం తల ఎత్తి వేగంగా అటూ ఇటూ తిప్పుతూ మువ్వలు గలగలా మ్రోగించేది పటేల్ వైపు నిర్లక్ష్యంగా చూస్తూ.

అటువంటిది ఇంకా రాలేదు. పక్కకు చూశాడు. చర్నకోల. బసవణ్ణి కొన్నప్పుడే దాన్ని చేశాడు. కాని ఇంతవరకు వాడలేదు. పొలంలో పక్కన రైతులు, "ఏహె! ఎద్దును కొట్టకుండా చర్నకోల ఎందుకురా!" అని ఒకరంటే "దోమల్ తోలటందుకురా!" అని మల్లయ్య అనేవాడు.

అది ఇవాళ వాడక తప్పదు. జంగయ్య లేచి చర్నకోల తీసుకున్నాడు. "ఎక్కడున్నా సరే సాయంత్రం వరకు బసవణ్ణి ఈడ్చుకొస్తా" అని మనసులు శపథం చేసుకుని బయల్దేరాడు.

"ఎక్కడికి జంగా! ఏమిటా మొహం. ఆ చర్నకోల ఎందుకు. బసవడు కనపడితే కొట్టకు జంగా. బసవడి మీద చర్నకోల పడితే ఇక్కడ గుళ్ళో నందీశ్వరుడి మీద వాతలు తేల్తాయి. నందీశ్వరుడు కదలని బసవడయితే బసవడు కదిలే నందీశ్వరుడు" అన్నాడు అయ్యవారు. జంగయ్య వినలేదు. వినదల్చుకోలేదు.

పిడికిలి చర్నాకోల మీద గట్టిగా బిగుసుకుంది. తల విదిల్చి వేగంగా అడుగువేశాడు. ఒకటి.. రెండు.. మూడు.. పది.. ఇంకా దాదాపు రెండు వందల అడుగులు వెయ్యాలి కొండ దిగాలంటే. పదిహేను.. ఇరవై..

అంతే..

జంగయ్య ఆగాడు.. అతని గుండె ఆగింది. కాళ్ళు ఆగినయి. కాసేపు ఊపిరి కూడా ఆగినట్టయింది.

గణ.. గణ.. గణ.. నల్లటి మూతి- వెడద కన్నులు- తెల్లటి ముఖం- మెత్తటి గంగడోలు.. చూసే లోపల గుబురుగా ఉన్న చెట్లలోంచి బసవడు బయటకొచ్చాడు.

జంగయ్య సంతోషానికవధుల్లేవు. మళ్ళీ గుండె కొట్టుకుంది. అడుగులు పడ్డాయి. పిడికిలి ఒదులైంది.

బసవడు ఇప్పుడు పూర్తిగా కనపడుతున్నాడు. అదేమిటి.. ఒంటి నిండా ఎర్రటి మరకలు. జంగయ్య ఒళ్ళంతా కన్నీరయింది. కాని అదేమిటి. నోట్లో గడ్డి. ఆకుపచ్చ ఆకులు. కొమ్మలతో ఉన్న ఆకులు.

"అయ్యగారూ! ఇగరాండ్రి! బసవణ్ణి నడిచేటి నందిదేవుడంటివి గద. అది చూడు దొంగది. తిన్నంత తిని దొంగ మేత నోట్ల పెట్టుకొస్తాంది. నువ్వాపొద్దు, నీ కాళ్మొక్కుత. దాన్ని చంపి నేను చస్త!" అని అరిచాడు.

అయ్యగారు కంగారుగా బయటకు వచ్చారు. జంగయ్యను చేయి పట్టుకుని దూరంగా తీసుకువెళ్ళాలని ప్రయత్నించాడు. జంగయ్య విదుల్చుకుని చివ్వున వెనక్కి తిరిగాడు. అప్పటికే బసవడు గుడి ముందుకు వచ్చాడు.

జంగయ్య చర్నాకోల లేపాడు. బలంగా వెనక్కి విసిరి బసవణ్ణి కొట్టాలని చెర్నాకోల బలంగా ముందుకు జాడించాడు.

"అబ్బ! ఎంత దెబ్బ కొట్టావురా జంగా!" అని కేక పెట్టారు అయ్యవారు.

ఆ దెబ్బ బసవడికి అడ్డం వచ్చిన అయ్యగారి మీద పడింది. జంగయ్య అవాక్కయినాడు. అప్పటికి గాని అతని ఉద్రేకం దిగి మనిషి కాలేదు.

"జంగా! ఇది దొంగ గొడ్డు కాదురా! మారేడు చెట్టు కొట్టేసిన రోజే ఇదీ పోయిందిరా. ఈ చుట్టుపక్కల మళ్ళీ 'బొమ్మెర' (బమ్మెర)లో తప్ప మరో మారేడు చెట్టు లేదు. దేవుడికి మారేడు దళాలు తేవాలని వెళ్ళింది. బొమ్మెర దారిలో ఎన్ని ముళ్ళ చెట్లుంటాయో తెలియదా.. మనం నడిచి పోయొస్తేనే రెండ్రోజులు పడుతుంది. దాని నోట్లో ఉన్నవి మారేడు కొమ్మలురా. చెట్టు నుంచి మారేడు కొమ్మలు తెంపటం ఎంత కష్టమో తెల్సా? అందుకే బసవడి ఒళ్ళంతా చీరుకుపోయి నెత్తురు కారింది" అని బసవడి దగ్గరకు వెళ్ళి మీదనున్న కండువాతో ఒళ్ళంతా తుడుస్తున్నాడు అయ్యవారు. బసవడి నోట్లో ఉన్న మారేడు కొమ్మలు కిందపడ్డాయి. గాలికి ఆ మారేడాకులు గలగలా అన్నాయి. అవి 'శివశివా' అన్నట్టు అనిపించింది అయ్యవారికి.

జంగయ్య మాట వినిపించకపోయేసరికి అయ్యవారు వెనక్కి తిరగబోయారు. 'ఛెళ్ళు'న శబ్దం వినపడింది. బసవడూ-అయ్యవారూ ఒక్కసారే తలెత్తారు. జంగయ్య చొక్కా విప్పుకుని చెర్నాకోలతో బలంగా వీపు మీద కొట్టుకున్నాడు. రక్తం చిమ్మింది. బసవడు వేగంగా ముందుకు ఎగిరి ముట్టెతో జంగయ్య వీపును రాశాడు. జంగయ్య నెత్తురు అంటి బసవడి ముఖం కుంకుమ బొట్టు పెట్టినట్లు సాయంత్రపు ఆకాశంలా మెరిసింది. ■

## అభిసారిక పిలుపు

గులక రాళ్ళు పలకరించి నాయిరా - పలకరించి
సిలక పలుకులెన్ని జెప్పినాయిరా!

1

ఎన్నెల్లో సిన్నదీ - ఎంతొసేపున్నదీ
కన్నుల్లో వొత్తులేసి - కాసుకోనున్నదీ
ఎన్నెల్లో సల్లగాలి - ఎగిసొచ్చి కాటేస్తే
సిన్నదేమొ బుగిలి బుగిలి - ఉస్సురుస్సురన్నదీ-
ఎన్నెలెంత యిరగకాసినాదిరా - సిన్నదాని
కన్నుల్లో సురకలేసినాదిరా! గులకరాళ్ళు...

2

ఆకులల్లాడితే- అదిరి గుండె జారితే
బిక్కబోయి కూసోనీ - దిక్కులెంక జూసేనూ
దిక్కులెక్కిరిస్తేనూ - సుక్కలెక్కిరిస్తేనూ
ఏరుపారుతుంటేనూ - బూచి గుండె కోతేనూ-
మన్ను మిన్నులేకమైనాయిరా - సిన్నదాని
కన్నుల్లో కలకలైనాయిరా! గులకరాళ్ళు...

3

ఎన్నెల సెగవిడిసినాది - మిన్నుమసకలేసినాది
ఏటిజాలు పుంతల్లో - ఎలుతురు కునుకేసినాది
సూసి సూసి గుబులేసీ - సూదిమంట సుదులేసే
గుచ్చి గుచ్చి గుండెల్లో - కొరివి కుంపటేసినాది-
బతుకు బుగ్గిసేసి పోమాకురా - పరుగునొచ్చి
సితుకుమంట లారిపేయాలిరా!
గులకరాళ్ళు పలకరించినాయిరా - పలకరించి
సిలక పలుకులెన్ని జెప్పినాయిరా!!

## పులకలు పోటెత్తిన వేళ

ఇన్ని పూలు కోసినావు ఎందుకోసం, మాలీ!
అని నన్ను- ఎవరైనా- ఎందుకు అడగాలి?
తనివారగ దోసిట - యీ పూట నిలుపుకోకుంటే
కనులు చల్లబడవే - మతి పూలెందుకు పూయాలి?
ఇన్ని పూలు కోసినావు...

నారుపోసినపుడు గాని - నీరు పోసినపుడు గాని
నా చేతులు రేగడిలో - నడిచి తడిమినపుడు గాని
తెలియరాని సుఖమేదో - కలిగినదేమోగాని
చిలిపిపూల స్పర్శలోన - చేయి వణికినపుడు గాని
తెలియలేదు నా గుండియ - లోతుల లోలోని
కాంక్ష!

ఇన్ని పూలు కోసినావు - ఎందుకోసం
అని ఎందుకు అడగాలి-
ఎందుకు అడగాలి? ఎందుకు అడగాలి??

-ఆలోకి